క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని ఎస్సై బి.గణేష్ సూచించారు. మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, చెడు అలవాట్లకు బానిసై జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుపై ఏకాగ్రత పెంపొందించుకుంటే భవిష్యత్ బంగారు బాటలో పయనిస్తుందన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు గ్రామాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేస్తున్నామని, ఈ మహాయుద్ధంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అవయవ దానం ఎంతో గొప్పది

విజయనగరం ఫోర్ట్: అవయవ దానం ఎంతో గొప్పదని లక్ష్మీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వీరాస్వామి అన్నారు. నర్సింగ్ కళాశాలలో అవయవ దాత పల్లవి జ్ఞాపకార్థం శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పల్లవి త్యాగం అమూల్యమన్నారు. మరణానంతరం కూడా పలువురి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు వచ్చిన పల్లవి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. అవయవదానానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, చుక్క సాయిరెడ్డి, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో నిఘా నేత్రాలు


కోనాడలో నిఘా కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్


పూసపాటిరేగ: తీరప్రాంత గ్రామాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కోనాడ గ్రామంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలను శనివారం ఆయన పరిశీలించారు. వివిధ నేరాల్లో నిందితులను గుర్తించేందుకు, నేరస్తులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రతీ సచివాలయం పరిధిలో ఏఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీలు ఇంటింటికీ వెళ్లి చిన్నపిల్లల వివరాలను నమోదు చేసుకుని, అవసరమైన వారికి వ్యాక్సిన్లు వేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అందుకే అప్పుడే పుట్టిన శిశు సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే చేపడుతోందన్నారు. అందులో భాగంగానే ప్రతీ చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించడం జరుగుతుందన్నారు. ప్రతీ తల్లి తమ పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

విజయనగరం ఫోర్ట్: పార్టీ బలోపేతానికి యువ నాయకులు కృషి చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కరాజు రామారావు అన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ యువజన నేతలతో సమీక్ష నిర్వహించడంతో పాటు వారికి దిశానిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. మహిళల సాధికారిత, అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువతకు ఉద్యోగాలు లేక నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. 2014 ఎన్నికల ముందుల బీజేపీ అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేసిందని ఆరోపించారు. సమావేశంలో జాతీయ మహిళా యువజన అధ్యక్షురాలు మమత నాగిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్, సీనియర్ నాయకులు ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాటడం నరకడం ఎందుకు?

- అటవీశాఖ చెట్లు నాటడం.. విద్యుత్‌శాఖ వాటిని నరకడం
- లక్షలాది రుపాయల ప్రజాధనం వృథా


కోనాడ జంక్షన్ రహదారిలో నరికిన చెట్లు మొదలలు

పూసపాటిరేగ: పచ్చని చెట్లు– ప్రగతికి మెట్లు. పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు చెట్లు ఎంతోగానో దోహదపడతాయని ప్రతి ఒక్కరికీ తెలుసు. అయితే పూసపాటిరేగ మండల పరిధిలో పలు రహదారులకు ఇరువైపులా అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన చెట్లను విద్యుత్‌శాఖ అధికారులు తరుచూ నరికి వేయిస్తున్నారు. కోనాడ జంక్షన్ నుంచి కోనాడ వెళ్లే అర్అండ్‌బీ రహదారి, కొప్పెర్ల నుంచి పూసపాటిరేగ వెళ్లే జాతీయ రహదారి, సీహెచ్ అగ్రహారం జంక్షన్ నుంచి కుమిలి వెళ్లే రహదారి, మైలాన్ జంక్షన్ నుంచి చింతపల్లి వెళ్లే రహదారితో పాటు పలు రహదారులలో చెట్లను విచక్షణ రహితంగా నరికేస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డువస్తున్నాయని నరికేస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు. ఫారెస్టు అధికారులు మొక్కలు వేసినప్పుడు విద్యుత్ లైన్ల క్రింద వేయడంతో ఎంతో వ్యయప్రయాసలతో పెంచిన చెట్లను విద్యుత్‌శాఖ అధికారులు నరికేస్తున్నారు. ఫారెస్టు అధికారులు అనాలోచితంగా మొక్కలు నాటారానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పచ్చదనంతో అలరారే పలు రహదారులు చెట్లు నరికివేతతో బోసిపోయాయి. ప్రతి ఏటా చెట్లు పెంపకానికి లక్షలాది రుపాయలు ఖర్చు చేయడం తప్పా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇప్పటికైనా ఫారెస్ట్, విద్యుత్‌శాఖ సిబ్బంది సమన్వయంతో చెట్ల సంరక్షణకు కృషిచేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

చెట్లు నరికేస్తున్నారు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటించింది. వాటి సంరక్షణకు లక్షలాది రుపాయలు ఖర్చు చేస్తోంది. అవి పెరిగి పెద్దవి అయ్యాక విద్యుత్ లైన్లకు అడ్డు వస్తున్నాయనే కారణంతో వాటిని నరికేస్తున్నారు. – ఎం.జయరాం, పూసపాటిరేగ

ప్రజాధనం వృథా

లక్షలాది రుపాయలు వెచ్చించి రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం, అడ్డువచ్చాయని మొక్కలు నరకడం పరిపాటిగా మారింది. అటవీశాఖ మొక్కలు వేయడం విద్యుత్‌శాఖ మొక్కలు నరకడమే జరుగుతోంది. ఇక ముందైనా అధికారులు పరిశీలన చేసి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ప్రజాధనం వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. – ఎస్.శ్రీనివాసరావు, పూసపాటిరేగ

వీధి వ్యాపారులకు అవగాహన కల్పించాలి

విజయనగరం: ప్రధానమంత్రి వీధి విక్రయదారుల ఆత్మనిర్భర నిధి కార్యాచరణ ప్రక్రియను వేగవంతం చేయాలని టీపీఆర్‌ఓ సింహాచలం కమ్యూనిటీ ఆర్గనైజర్లను ఆదేశించారు. నగరంలో స్వనిధి, స్వాభిమానం కార్యక్రమాలను 15 రోజులపాటు సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోజుకు ఐదు సచివాలయాల పరిధిలో ఉన్న వీధి విక్రదారుల సమగ్ర సమాచారం సేకరించడంతో పాటు పెండింగ్ రుణాలను అందజేయడం వంటి అంశాలను ఈ కార్యక్రమంలో పొందుపరిచారు. టీపీఆర్‌ఓ సింహాచలం మాట్లాడుతూ వీధివిక్రయదారుల ద్వారా డిజిటల్ లావాదేవీలు చేయించడం, మొబైల్ యాప్ డౌన్లోడ్ చేయించుటకు ఉద్దేశించి స్వనిధి, స్వాభిమానం కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. 15 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నగరవ్యాప్తంగా చేపట్టి చిరువ్యాపారులను చైతన్య పరచాలని చెప్పారు. కేంద్ర సామాజిక భద్రత పథకాలలో వీధి వ్యాపారులను వారి కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

విరాళం అందజేత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ గోవిందరావు లెప్రా సొసైటీకు శనివారం రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. కుష్ఠు వ్యాధి బాధితులకు ప్రత్యేక పాదరక్షల కొనుగోలు నిమిత్తం ఈ విరాళాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లెప్రా సొసైటీ రీసోర్స్ పర్సన్ లెంక రమణ మాట్లాడుతూ సంస్థ ద్వారా జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో బాధితులకు వివిధ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. విరాళాలు అందించిన దాతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


జోనల్‌స్థాయిలో ప్రతిభ కనబరిచిన అనుదీప్తికి బహుమతి అందిస్తున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనకసింహాచలం, ప్రదీప్‌రాజు, తదితరులు

డెంకాడ: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 'భగవంతుడే నా నిజమైన స్నేహితుడు' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. జోనల్ స్థాయిలో రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దిండి అనుదీప్తి ప్రథమ స్థానంలో నిలిచింది. మండల స్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో టి.ప్రశాంతి, కె.సౌమ్య గాయత్రి, పి.భవ్యశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. తెలుగు మీడియంలో పి.వైష్ణవి విజేతగా నిలిచింది. విజేతలకు డెంకాడ సత్యసాయి మందిరం వద్ద పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, ప్రదీప్‌రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాసరాజు, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రఘుమండ హెచ్‌ఎం సౌభాగ్యలక్ష్మి అభినందించారు.

నీటిని వృథా చేయొద్దు

విజయనగరం: తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి వృథాను అరికట్టేందుకు ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. నగరంలోని గాజులరేగ, కేఎల్ పురం, పద్మావతి నగర్, తదితర ప్రాంతాల్లో శనివారం క్షేత్ర పర్యటన చేశారు. కొత్తగా వేసిన పైప్‌లైన్లను పరిశీలించారు. అనంతరం వివిధ టిఫిన్ దుకాణాలు, చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని, రహదారులపై చెత్తాచెదారాలు వేయరాదని సూచించారు. ఎంతో వ్యయ ప్రయాసలతో మంచినీటి సరఫరా జరుగుతోందని, నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు.

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఈమేరకు కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం పలు పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారికి, ఇతర సిబ్బందికి ఓటరు నమోదు ప్రక్రియపై తగు సూచనలు చేశారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కొత్త ఓటర్లుగా నమోదు కావడం, ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు అవసరమైన ఫారాలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. ఒక నియోజకవర్గ నుంచి మరొక నియోజకవర్గానికి పేరు మార్పు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వానిధితో తక్కువ వడ్డీకే రుణాలు


మాట్లాడుతున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: స్వానిధి–స్వాభిమానం పథకం ద్వారా పట్టణానికి చెందిన డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం మెప్మా ఆధ్వర్యంలో 'పీఎం స్వానిధి–స్వాభిమానం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఎం డి.గోవిందరావు, సీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రినాథమ్మ, వీఆర్‌ఓ కె.వెంకటలక్ష్మి, వార్డు మహిళా కార్యదర్శి ఒ.దివ్యవాణి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు


రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలో రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్‌తో పోలీసు బృందాలు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా కట్టుదిట్టం చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా సెక్యూరిటీ ఆర్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏకకాలంలో పలుచోట్ల తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. తనిఖీల్లో వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐలు నరేష్, అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కెమిస్ట్రీ వర్క్‌షాప్


పరిశోధక విద్యార్థులతో ప్రొఫెసర్లు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన జర్నల్ ఆఫ్ కెమికల్‌సైన్సెస్ అవుట్ రీచ్ కార్యక్రమం (రసాయశాస్త్ర వర్క్‌షాప్) శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. రసాయనశాస్త్రం అభ్యసించిన వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఇందులో పరిశోధనలకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే కెమిస్ట్రీపై ఆసక్తి పెంచుకుంటే ఈ సబ్జెక్ట్‌పై పట్టుసాధించవచ్చన్నారు. అనంతరం జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకులు ప్రొఫెసర్ ఎస్.నటరాజన్ మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులకు రిసెర్చ్ చేయడానికి లేదా ఎవరైనా రసాయన శాస్త్రంలో పోస్ట్ డాక్ పరిశోధనలు చేయాలనుకుంటే తమ పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీదేవి, డాక్టర్ అనిరుధ్‌కుమార్, డాక్టర్ బొత్తు కోటయ్య, ప్రొఫెసర్ జేఎం మిశ్రా, ప్రొఫెసర్ ఎస్‌బీకివాడే, వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు


విజయనగరం రూరల్: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడ జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కూర్మనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శీతాకాల సమావేశాల్లో కార్మికులకు కనీస వేతనం అమలు అయ్యేలా బిల్లు పాస్ చేయాలని కోరారు. అలాగే రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన 15 ఏళ్లుగా కనీస వేతన చట్టం అమలు అవ్వడం లేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

1200 కిలోల ప్లాస్టిక్ ఉత్పత్తుల సీజ్


సీజ్ చేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులతో ప్రజారోగ్య విభాగం సిబ్బంది

విజయనగరం: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు వినియోగిస్తున్న, విక్రయిస్తున్న దుకాణాలలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది దాడులు ముమ్మరం చేశారు. గత పక్షం రోజులుగా నిషేధిత ప్లాస్టిక్‌పై ఆంక్షలు విధించినట్లు కార్పొరేషన్ యంత్రాంగం ప్రకటించినప్పటికీ నగరంలో వాటి వినియోగం, విక్రయాలు జోరు తగ్గలేదు. తాజాగా శనివారం నగరంలోని హోల్‌సేల్ ప్లాస్టిక్ విక్రయాల దుకాణాలకు వెళ్లిన ప్రజారోగ్య సిబ్బంది 1200 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను గుర్తించి సీజ్ చేశారు. వాటిని విశాఖపట్నంలోని జిందాల్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమం సందర్శన


రక్తదానం చేస్తున్న యువతను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్: మండలంలోని పినవేమలి గ్రామంలో ఉన్న ఏబీసీడీ వృద్ధాశ్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు శనివారం సందర్శించారు. ఆమె పుట్టినరోజును పురస్కరించుకుని ఆశ్రమంలో వృద్ధులకు మిఠాయిలు, ఆహార పొట్లాలను అందజేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక యువత, పార్టీ కార్యకర్తలు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

అదానీని అరెస్టు చేయాలి: సీపీఎం డిమాండ్



కోట వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: సౌర విద్యుత్ కొనుగోలులో రూ.2029 కోట్లు లంచాలు ముట్టచెప్పినట్లు అమెరికా కోర్టులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ అధినేత గౌతం అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు శనివారం స్థానిక కోట వద్ద నిరసన కార్యక్రమము చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా అవినీతికి పాల్పడిన అదానీని అరెస్టు చేయకుండా రెండు వారాల తరువాత దర్యాప్తు చేస్తామని కేంద్రం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అదానీతో రాష్ట్రంలో చేసుకున్న ఒప్పందాలన్ని తక్షణమే రద్దు చేయాలని, అలాగే అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని, తక్కువ ధరకు విద్యుత్‌ని ప్రజలకు సరఫరా చేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అదానీకి అండగా ఉన్నాయని ఆరోపించారు. టీడీపీ, బీజేపీ, జనసేనా పార్టీలు అదానీ అరెస్టుకు డిమాండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, హరీష్, రంభ శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదు సామాజిక బాధ్యత


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ బి.సుదర్శనరావు సూచించారు. మండలంలో మొయిద విజయరామపురం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు పొందడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదుకావాలన్నారు. రెండు రోజుల పాటు అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథం, బీఎల్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

నెల్లిమర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితాను శనివారం తహసీల్దార్ పి.సుదర్శనరావు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదు మేరకు జాబితాలను రూపొందించి ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. జాబితాల్లోని వివరాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా డిసెంబరు 9వ తేదీలోగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

నేడు సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాహిత్యం, సంప్రదాయం అనే విషయంపై విశాఖ గాయత్రీ విద్యాపరిషత్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సర్వమంగళశాస్త్రి ప్రసంగిస్తారని వెల్లడించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ అధ్యక్షుడు రొంగలి పోతన్న సభాధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. గురజాడ ఇందిర స్వీయ కవితా పఠనం ఉంటుందని తెలిపారు. సమన్వయకర్తగా ధర్మవరానికి చెందిన విశ్రాంత ఆంధ్రోపాధ్యాయులు కొట్టు బాబూరావు వ్యవహరిస్తారన్నారు. సాహితీ అభిమానులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అవగాహన ర్యాలీ


ర్యాలీ చేపడుతున్న ఫార్మసీ కళాశాల విద్యార్థులు

విజయనగరం అర్బన్: ఫార్మసీ ఉపయోగాలను తెలియజేస్తూ మహరాజా ఫార్మసీ కళాశాల విద్యార్థులు పట్టణ వీధుల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేషనల్ ఫార్మసీ వీక్ సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, గంటస్తంభం, బాలాజీ కూడలి మీదుగా సాగింది. 'థింక్ హెల్త్–థింక్ ఫార్మసీ' అనే నినాదంతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మన్మథరావు

విజయనగరం క్రైమ్: అనధికార మద్యం అమ్మకాలు చేస్తే కఠినచర్యలు తప్పవని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మన్మథరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బెల్ట్‌షాపులపై దాడులు విస్తృతం చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో 13 కేసులు నమోదుచేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద 21 లీటర్ల మద్యాన్ని రికవరీ చేశామన్నారు. మద్యం షాపుల వద్ద నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేయాలని, ప్రతీ వైన్‌షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే వైన్‌షాపుల ద్వారా అమ్మకాలు చేయాలని, బార్‌లకు రాత్రి 11 గంటల వరకు అనుమతులున్నాయన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి


పూసపాటిరేగ: సాయిబాబా భజనలో పాల్గొన్న భక్తులు


డెంకాడ: పినతాడివాడలో సత్యసాయిబాబా చిత్రపటంతో ఊరేగింపు చేస్తున్న భక్తులు

పూసపాటిరేగ: స్థానిక రాజావీధిలోని షిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. 9 గంటల నుంచి భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

- డెంకాడ: మండలంలోని పలు గ్రామాల్లో సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పినతాడివాడ, డెంకాడ గ్రామాల్లో సత్యసాయిబాబా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. పేదలకు వస్త్రదానం చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.